క్లుప్తంగా

ఆర్టీసీకి ఓఎన్‌జీసీ ట్రాలీ డస్ట్‌బిన్ల బహూకరణ



ఆర్టీసీకి ట్రాలీ డస్ట్‌బిన్లను అందజేసిన ఓఎన్‌జీసీ ప్రతినిధి అన్వర్, సిబ్బంది

కాకినాడ: ఏపీఎస్ ఆర్టీసీ కాకినాడ డిపోకు ఓఎన్‌జీసీ సంస్థ 12 ట్రాలీ డస్ట్ బిన్‌లను సమకూర్చింది. వీటిని ఓఎన్‌జీసీ సంస్థ సీఎస్సార్ ప్రతినిధి అన్వర్ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు సమక్షంలో జరిగిన కార్యక్రమంలో శనివారం అందజేశారు. అఖిల భారత మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో డిపో ఆవరణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, స్టేషన్ మేనేజర్ జి.శ్రీనివాస్ మహిళా సమాఖ్య కార్యదర్శి ఎన్.భానుమతి, కోశాధికారి పి.పద్మజావాణి, ఉపాధ్యక్షురాలు మీనాక్షి, సభ్యులు డాక్టర్ డీఆర్ ఉష, కె పద్మజ, డి.శ్రీవల్లి, పీకే దుర్గాంబ తదితరులు పాల్గొన్నారు.

10న కోర్కెల దినోత్సవం

కాకినాడ సిటీ: మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేళ్లు గడుస్తున్నా కార్మికవర్గం పెట్టిన ఏ ఒక్క డిమాండుని పరిష్కరించలేదని, ఏ పని చేసే కార్మికునికైనా కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా వర్కింగ్ కమిటీ సమావేశం డిమాండ్ చేసింది. శనివారం ఆ సంస్థ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా వర్కింగ్ కమిటీ సమావేశంలో పలువురు నాయకులు పాల్గొని మాట్లాడారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులర్ చేయాలని, కార్మికులకు వ్యతిరేకమైన 4 లేబర్ కోడ్లు రద్దు చేయాలని, ట్రాన్స్ పోర్టు కార్మికుల మెడకు ఉరితాడుగా జులై 1 నుంచి అమలులోకి వచ్చిన నూతన క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాకినాడ పెద్దాసుపత్రిలో పని చేసే మెస్ కార్మికుల నుంచి 7 నెలల పీఎఫ్ కట్టించుకుని డిపార్టుమెంట్‌కు జమ చేయకుండా కార్మికుల సొమ్ముతో వడ్డీ వ్యాపారం చేస్తున్నారన్నారు. కార్మికుల నుంచి యజమాని వాటా కూడా కార్మికుల వేతనాల నుంచి వసూలు చేస్తున్న జీజీహెచ్ అధికారులు కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోకుండా వెనుకాడుతున్నారని వివరించారు. సీఐటీయూ నాయకులు దువ్వా శేషుబాబ్జీ, కె సత్తిరాజు, చెక్కల రాజ్‌కుమార్, మలకా రమణ, చంద్రమళ్ల పద్మ, నర్ల ఈశ్వరి, రొంగల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'చేయూత'కు కలెక్టర్ అభినందనలు



కలెక్టర్‌ను కలిసిన చేయూత సంస్థ సభ్యులు

కాకినాడ సిటీ: కలెక్టర్ షాన్ మోహన్‌ను చేయూత స్వచ్ఛంద సంస్థ సభ్యులు శనివారం కలిసి అభినందించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.రవికుమార్, వారి సభ్యులు వారి సేవా కార్యక్రమాలను కలెక్టర్‌కు వివరించగా ఆయన వారిని అభినందించారు. గత 1150 రోజులుగా జీజీహెచ్ రోగుల సహాయకులకు అన్నదానం, 30 వేలకు పైగా రక్తదాతల నుంచి రక్తం, 40 మంది చిన్నారులకు ఉచిత విద్య, వైద్యం వసతి భోజన సదుపాయాలు కల్పించినట్లు వారు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం వారు కలెక్టర్ షాన్ మోహన్‌కి మొక్కను అందించారు. సంస్థ కాకినాడ జిల్లా అధ్యక్షురాలు సురభి శారద, డాక్టర్ సలాది కిరణ్‌కుమార్, చింతా పవన్ కళ్యాణ్, విష్ణు, మనోజ్ చూగని, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో హుండీల చోరీ

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ కాంప్లెక్‌లోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో హుండీలు చోరీకి గురయ్యాయి. శనివారం తెల్లవారుజామున ఆలయంలో దొంగలు చోరబడి తలుపులను బద్దలగొట్టి స్వామి వారి హుండీలలో సుమారు యాభైవేల రూపాయల నగదును దోపిడీ చేశారు. ఉదయం ఆలయం తెరచి చూసేసరికి హుండీలు పగులగొట్టి ఉండడంతో ఆలయ కమిటీ సభ్యులు సిద్ధ వీరబాబు, ముమ్మిడి ఈశ్వరరావు, మాదేపల్లి నాగేశ్వరరావు తదితరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గొల్లప్రోలు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఆలయ కమిటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్‌టీం అధికారులు హుండీలు ఆలయ పరిసరాల్లో వేలిముద్రలు సేకరించారు.

ప్రభుత్వ మద్యం దుకాణంలో చోరీ

పిఠాపురం: గ్రామం నుంచి చిత్రాడ వెళ్లే దారిలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణంలో గుర్తు తెలియని దుండగులు శనివారం తెల్లవారుజామున చోరీకి పాల్పడ్డారు. పిఠాపురం పట్టణ పోలీసుల కథనం ప్రకారం.. చిత్రాడ వెళ్లే దారిలో ఉన్న మద్యం దుకాణంలో గుర్తు తెలియని దుండగులు దుకాణం పైకప్పు తొలగించి 42 ఫుల్ బాటిళ్లు, 10 బీరు బాటిళ్ళు చోరీ చేశారు. దుకాణ సిబ్బంది శనివారం ఉదయం వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పిఠాపురం పట్టణ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఫ్లెక్సీ ఫ్రీ కాకినాడ!

- ప్రాథమికంగా భానుగుడి–కలెక్టరేట్ రహదారిపై దృష్టి
- బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగుల నియంత్రణపై కసరత్తు
- 8వ తేదీ వరకు డెడ్‌లైన్ పెట్టిన కార్పొరేషన్ అధికారులు



కలెక్టరేట్ ముఖద్వారం వద్ద మంత్రి నాదెండ్లకు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ (ఫైల్)

కాకినాడ: ఇష్టారాజ్యంగా వెలుస్తున్న ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగ్‌లను నియంత్రించే దిశగా కాకినాడ నగరపాలక సంస్థ దృష్టి సారించింది. ట్రాఫిక్‌కు అవరోధంగా మారి ప్రమాదాలకు కారణమవుతున్న వాటిని కట్టడి చేసే క్రమంలో ప్రాథమికంగా భానుగుడి–కలెక్టరేట్ రహదారిని ఫ్లెక్సీ ఫ్రీ రోడ్డుగా ప్రకటించింది. ఇందుకు సంబంధించి కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారి షాన్ మోహన్ ఆదేశాల మేరకు ఇందుకు సంబంధించిన కార్యాచరణకు అధికారులు సిద్ధమయ్యారు. నగరంలో చిన్న కూడళ్ల నుంచి ప్రతి చిన్న రహదారిలోను భారీ ఫ్లెక్సీలు పెట్టుకోవడం పరిపాటిగా మారిపోయింది. రాజకీయనాయకులతో పాటు వ్యాపార సంస్థలు, ఇతర వర్గాలు కూడా హోర్డింగ్‌లు, బ్యానర్లకు బాగా అలవాటుపడిపోయారు. ఇది నగర సుందరీకరణకు, ట్రాఫిక్ సమస్యలకు ప్రధాన కారణమవుతోంది. ముఖ్యంగా రద్దీగా ఉండే భానుగుడి జంక్షన్ వంటి ప్రాంతాల్లో అక్కడ ఏర్పాటు చేసిన భారీ హోర్డింగ్‌లను చూస్తూ ప్రమాదాలకు గురైన సంఘటనలు కూడా గతంలోనే నెలకొన్నాయి. ఈ పరిస్థితి మరింత అదుపు తప్పి ఇంతకు ముందెపుడూ లేని విధంగా చివరకు కలెక్టరేట్ ప్రధాన ద్వారాన్ని కూడా రాజకీయ నాయకుల హోర్డింగ్‌లకు నిలయంగా మార్చేశారు. ఇటీవల పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లాకు వచ్చిన సందర్భంగా కలెక్టరేట్ ముఖద్వారానికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లే ఇందుకు నిదర్శనంగా ఉన్నాయి.

ఇక ఆ ప్రాంతం ఫ్లెక్సీ ఫ్రీ..

ఈ నేపథ్యంలో కాకినాడ భానుగుడి జంక్షన్ నుంచి ఓవర్ బ్రిడ్జి, టూటౌన్ పోలీస్‌స్టేషన్, నూకాలమ్మ గుడి, త్రీలైట్ జంక్షన్, ఎండోమెంట్ కార్యాలయం, పీఆర్ కళాశాల, పొట్టి శ్రీరాములు విగ్రహం, సీబీఎం స్కూల్, జెడ్పీ సెంటర్ మీదుగా కలెక్టరేట్–ఇంద్రపాలెం వంతెన వరకు ఫ్లెక్సీ ఫ్రీ రోడ్డుగా ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రధాన ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచి, రెండో దశలో ఇలాంటి విధానాన్ని నగరంలోని ఇతర ప్రాంతాలకు విస్తరింపచేయాలని ఆలోచిస్తున్నారు. ఆ మేరకు కలెక్టర్ ఆదేశాలతో నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ నెల 8వ తేదీ లోపుగా నిర్దేశించిన ప్రాంతంలో హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు, బ్యానర్లను నిర్వాహకులే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. లేదంటే 9వ తేదీ నుంచి నగర పాలక సంస్థ ద్వారా తొలగించి అందుకు అయ్యే ఖర్చును సంబంధిత యజమానుల నుంచి వసూలు చేస్తామని కమిషనర్ స్పష్టం చేశారు.

ఫ్లెక్సీలను నియంత్రించాలి

ఫ్లెక్సీలను నియంత్రించే విషయంలో నగర పాలక సంస్థ మరింత కఠినంగా వ్యవహరించాలి. కలెక్టరేట్ ముఖద్వారానికి కూడా ఫ్లెక్సీలు పెట్టిన తీరు అత్యంత బాధాకరం. శృతిమించిన ఇటువంటి ప్రచారాలను నియంత్రించకపోతే భవిష్యత్‌లో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొనక తప్పదు. వీటిని ఏర్పాటు చేసే విషయంలో అధికారులు ప్రత్యేక నియమ నిబంధనలను నిర్ణయించి ప్రకటించాలి.

– దూసర్లపూడి రమణరాజు,
సామాజికవేత్త, కాకినాడ

ప్రభుత్వ ప్రోత్సాహకాలతోనే సహకార సంఘాల మనుగడ



డీసీఎంఎస్ సీఈఓతో మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ శ్రీనివాస్

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): కాకినాడలోని టౌన్ రైల్వేస్టేషన్ సమీపంలోని డీసీఎంఎస్ (డిస్ట్రిక్ కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ)ని శనివారం సహకారశాఖ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఎస్ఎస్ఎల్‌టి శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార మార్కెటింగ్ సంఘాల మనుగడ పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే ప్రోత్సాహక నిర్ణయాలపై ఆధారపడి ఉందన్నారు. సహకార స్ఫూర్తితో ఉన్న సంఘ పాలక వర్గం, వ్యాపారపరమైన మార్కెట్ అంచనాలు, ప్రణాళికలు, ఆర్థిక క్రమశిక్షణ కలిగిన సిబ్బంది తదితర అంశాలు మాత్రమే ఈ వ్యవస్థను బలోపేతం కావడానికి దోహదపడతాయన్నారు. సీఈఓ బాపిరాజు, అసిస్టెంట్ బిజినెస్ మేనేజర్ కొండేపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నీటి నాణ్యతపై ప్రజలనే అడగండి

- కార్యదర్శులకు కమిషనర్ ఆదేశం
- నిత్యం 10 నమూనాల పరిశీలన



మంచినీటి నాణ్యతను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటరావు



సచివాలయ సిబ్బందిని ప్రశ్నిస్తున్న కమిషనర్ వెంకటరావు

కాకినాడ: ప్రజలకు శుద్ధి చేసిన, స్వచ్ఛమైన నీటిని అందించేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు స్పష్టం చేశారు. ఇందులో భాగంగా నిత్యం పది నీటి నమూనాలను పరీక్షించాలని, కనీసం 25 మంది గృహ యజమానులను కలిసి తాగునీటి నాణ్యతపై అడిగి తెలుసుకోవాలని ఆయా సచివాలయ ఎమినిటీ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం ఆయన ఆనంద్ థియేటర్ సమీపంలోని ఫ్లై ఓవర్ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడి ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో తాగునీటి సరఫరా లోపాలపై స్వయంగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నీటి సరఫరాలో లోపాలపై ఆరా తీశారు. నిత్యం రెండు పూటలా నీరు సక్రమంగానే వస్తోందని, కొన్నిసార్లు నీరు రంగు మారడం సహా కొన్ని సమస్యలను స్థానికులు కమిషనర్‌కు వివరించారు. దీనిపై స్పందించిన కమిషనర్ విక్టోరియా వాటర్ వర్క్స్‌ను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఫిల్టరేషన్‌పై అధికారులతో చర్చించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటిలో ఎటువంటి సమస్యా లేదని, అయితే కొన్నిసార్లు పైప్‌లైన్ మరమ్మత్తుల వల్ల నీటి కాలుష్యం ఎదురవుతోందన్నారు. వీటిని గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులో భాగంగా ఆయా ఎమినిటీ కార్యదర్శులు తమ పరిధిలో స్వయంగా 25 ఇళ్లకు వెళ్లి నీటి నాణ్యతపై నేరుగా ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకుని తనకు చెప్పాలని సూచించారు. అలాగే ప్రతిరోజు 10 నమూనాలను పరీక్షించాలని ఆదేశించారు. అలా నిరంతర పర్యవేక్షణ ద్వారా ప్రజలకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా నాణ్యమైన నీటిని అందించగలమని స్పష్టం చేశారు. ప్రజలు కూడా ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే స్థానికంగా ఉండే సచివాలయాల్లో గాని, నగరపాలక సంస్థలోని టోల్ ఫ్రీ నెంబర్ 1800 4255 990 నెంబర్‌కు గాని తెలియజేయాలని సూచించారు. ఆయన వెంట ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, డీఈ బీహెచ్ సుబ్బారావు, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, ఆయా సచివాలయాల కార్యదర్శులు ఉన్నారు.

సచివాలయం తనిఖీ

ముగ్గురిపై చర్యలకు ఆదేశం

కాకినాడ: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ముగ్గురు సచివాలయ కార్యదర్శులపై కమిషనర్ వెంకటరావు అసహనం వ్యక్తం చేశారు. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శనివారం ఆయన పరలోపేట పాములరాతూము సమీపంలోని 10–బి సచివాలయాన్ని తనిఖీ చేసి, ఉద్యోగుల హాజరు, పనితీరు, రికార్డుల నిర్వహణను పర్యవేక్షించారు. అక్కడి ప్లానింగ్ సెక్రటరీ డ్రెస్ కోడ్‌ను ఉల్లంఘించి విధులకు హాజరుకావడంతో షోకాస్ నోటీస్ ఇవ్వాలని ఆదేశించారు. అలాగే కార్యాలయంలో అందుబాటులలోని ఎమినిటీ సెక్రటరీకి కూడా షోకాజ్ నోటీస్ ఇస్తున్నట్లు తెలిపారు. పన్నుల వసూళ్లలో వెనుకబడ్డ సచివాలయ అడ్మిన్‌కు మెమో ఇవ్వాలని నిర్ణయించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించాలని, అందుకు విరుద్ధంగా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఏమాత్రం ఉపేక్షించబోమని కమిషనర్ స్పష్టం చేశారు.

డ్రైనేజీని పరిశుభ్రం చేయండి



రైల్వేగేటు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

కాకినాడ: కాకినాడ అచ్యుతాపురం రైల్వే గేట్‌ను ఆనుకుని ఉన్న డ్రైనేజీని శుభ్రం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు అధికారుల ఆదేశించారు. శనివారం అయన ఆ ప్రాంతాన్ని సందర్శించారు. మెయిన్ డ్రైన్‌లో కలిసే ఈ డ్రైనేజీని రైల్వే శాఖ సమన్వయంతో పూడికతీత పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. 47, 48 డివిజన్ల ప్రజలకు ఉపయోగపడే పనుల విషయంలో అధికారులు దృష్టి సారించాలని కమిషనర్ కోరారు. రైల్వే అధికారులను సంప్రదించి ఆమోదం తెలిపిన వెంటనే టీఎంఎక్స్ మిషన్‌ను వినియోగించి పూడిక తొలగించాలని, ఆ ప్రాంత ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంహెచ్‌ఓ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్తెప్ప నాయుడు తదితరులు ఉన్నారు.

భవన నిర్మాణ వ్యర్థాలు తొలగించకుంటే జరిమానా

కాకినాడ: ఇళ్లు, వాణిజ్య సముదాయాల వద్ద ఉన్న గృహ నిర్మాణ వ్యర్థాలను తక్షణమే తొలగించాలని, లేకుంటే రూ.5వేల జరిమానా విధిస్తామని కమిషనర్ వెంకటరావు స్పష్టం చేశారు. యజమానులు తమ భవన నిర్మాణ వ్యర్థాలను ఏటిమొగలోని భవన నిర్మాణ వ్యర్థాల ప్రాసెసింగ్ స్థలానికి తరలించాలని, సొంతంగా తరలించుకునే అవకాశం లేకపోతే 91778 40881 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇస్తే సంబంధిత వార్డు ప్లానింగ్ కార్యదర్శి ఆ ప్రాంతానికి వచ్చి వ్యర్థాల పరిమాణాన్ని బట్టి ధర నిర్ణయిస్తారన్నారు. ట్రిప్పునకు రూ.వెయ్యి చొప్పున నగర పాలక సంస్థ సివిక్ సెంటర్లో సొమ్ము చెల్లిస్తే రసీదు కూడా ఇస్తారని, అనంతరం 48 గంటల వ్యవధిలో భవన నిర్మాణ వ్యర్థాలను తరలించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం

- జిల్లా జడ్జి కమలాదేవి

కాకినాడ లీగల్: ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పి.కమలాదేవి అన్నారు. శనివారం కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి కోర్టు హాలులో ట్రాఫిక్ పోలీసులు, అధికారులుతో కోర్టు ఉద్యోగులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి కమలాదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమన్నారు. ట్రాఫిక్ పోలీస్ అధికారులు మాట్లాడుతూ ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యాన్ని చేరండని, వేగం కన్నా ప్రాణం మిన్న అని ఉద్యోగులుకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి కాకినాడ ట్రాఫిక్ 1, 2 సీఐలు ఎస్.రమేష్, చైతన్యకృష్ణ, అధికారులు ఏపీ పద్మావతి, కె.రామస్వామి, డి.శ్రీకాంత్‌బాబు, కోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులతో అప్రమత్తం

కాకినాడ రూరల్: పెంపుడు జంతువుల పట్ల యజమానులు శ్రద్ధ వహించాలని తద్వారా వ్యాధుల బారిన పడే సమస్య ఉండదని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్, కాకినాడ ఐడీఏ సంయుక్త ఆధ్వర్యంలో జునోసిస్ డేను పురస్కరించుకుని శనివారం ఏర్పాటు చేసిన సదస్సులో పెంపుడు జంతువుల యజమానులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రత్నప్రసాద్, డాక్టరు నాగేంద్ర, డాక్టరు చైతన్య, తదితరులు పాల్గొన్నారు.


శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి

కాకినాడ రూరల్: స్వాతంత్ర సమరయోధుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర నాయకుడు రవిశంకర్ పట్నాయక్, అడబాల రత్నప్రసాద్ తదితరులు నివాళులర్పించారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళులు

కాకినాడ రూరల్: స్వాతంత్ర సమర యోధుడు బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం శనివారం నివాళులర్పించింది. ఈ సందర్భంగా న్యాయవాది కుమార్ రాజా మాట్లాడుతూ ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా వంటి ఉద్యమాలలో చురుగ్గా పాల్గొని రెండు సార్లు జైలు శిక్ష అనుభవించిన జగ్జీవన్ రామ్ గొప్ప గాంధేయవాది అని అన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దౌర్జన్యాలు అరికట్టాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సమితి సభ్యులు

కాకినాడ సిటీ: పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దౌర్జన్యాలు, అత్యాచారాలను ఖండిస్తూ భారతీ సేవా సమితి ఆధ్వర్యంలో వివిధ మహిళా సంఘాల నేతలు కలెక్టరేట్ వద్ద శనివారం ధర్నా చేశారు. సమితి నాయకురాలు తుమ్మల పద్మజ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా ఎన్నికై న సీఎం మమతాబెనర్జీ పాలనలో మొన్నటి సందేశ్‌ఖాలి, కుచ్ బీహార్ మొదలు నిన్నటి చోప్రా గ్రామంలో స్త్రీలపై జరిగిన అమానవీయ ఘటనలు షరియా చట్టాల ప్రకారం చోటు చేసుకోవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. పశ్చిమ బెంగాల్‌లో రాజ్యాంగ చట్టాలు, పోలీసు వ్యవస్థ కనుమరుగు అయినట్లు తెలుస్తోందన్నారు. ఈ అక్రమాలను ఆపాలని, మహిళల మాన, ప్రాణాలకు, గౌరవ మర్యాదలకు రక్షణ కల్పించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఉపాధి పనులపై అవగాహన అవసరం



పెనుగుదురులో ఉపాధి కూలీలకు పనులపై అవగాహన కల్పిస్తున్న ఏపీఓ రమణకుమార్

కరప: గ్రామంలోని ఉపాధి కూలీలందరికీ పనులు కల్పించనున్నామని, ఈ పనులపై అందరూ అవగాహన కల్పించుకోవాలని ఏపీఓ జీవీ రమణకుమార్ తెలిపారు. పెనుగుదురు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఉపాధి కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరంలో మంజూరైన పనులన్నీ పూర్తి చేశామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం కొత్తగా 20 పనులు మంజూరయ్యాయని, డిమాండ్ ప్రకారం ఉపాధి కూలీలతో పనులు చేయిస్తామన్నారు. మరో 10 పనులకు అంచనాలు వేసి పంపుతున్నామని ఏపీఓ తెలిపారు. టెక్నికల్ అసిస్టెంట్ కె.ప్రకాష్ మాట్లాడుతూ కూలీలకు ప్రభుత్వం నిర్ణయించిన రోజువారీ వేతనం రూ.300 రావాలంటే ఏయే పనులు, ఏ కొలతల ప్రకారం చేయాలో వివరించి, ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. మండల బీజేపీ అధ్యక్షుడు బండారు మురళి, గ్రామ కమిటీ అధ్యక్షుడు జి.నానిబాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ సంచులతో పర్యావరణానికి హాని

లయన్స్ క్లబ్ ప్రాంతీయ ఛైర్మన్ పద్మ తులసి



సర్పవరం జంక్షన్‌లో సంచులను పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ సభ్యులు

కాకినాడ రూరల్: ప్లాస్టిక్ సంచుల వినియోగం ద్వారా పర్యావరణానికి హాని కలుగుతోందని, వాటి స్థానంలో కాగితపు సంచులు వినియోగించాలని లయన్స్ క్లబ్ ప్రాంతీయ ఛైర్మన్ పద్మ తులసి పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో శనివారం వస్త్ర సంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులు మానవ జీవితంతో మమేకమై ప్రతి వస్తువును వాటితో తీసుకువచ్చే పరిస్థితి నెలకొందన్నారు. ప్లాస్టిక్ సంచులు భూమిలో ఏళ్ల తరబడి నిల్వ ఉండి వర్షపు నీరు ఇంకకుండా అడ్డుకుంటున్నాయన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ వస్త్ర, కాగితపు సంచులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు ఎం.ప్రసన్న, శ్రీదేవిరెడ్డి, శ్రీవాణి, రమాసుందరి, విజయలక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ స్టార్ అధ్యక్షురాలు షర్మిల

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

బోట్‌క్లబ్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు నడుం బిగించాలని లయన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్ ప్రతినిధి గరికిపాటి నమఃశివయ్య అన్నారు. లయన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్ ఆధ్వర్యంలో శనివారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కల పంపిణీ చేపట్టారు. రామారావు పేటలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ స్టార్ అధ్యక్షురాలు షర్మిల అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నమఃశివయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలన్నారు. కోవిడ్ సమయంలో ఆక్సిజన్ దొరకక ఎందరో తమ ప్రాణాలు కోల్పోయారన్నారు. వాతారణ సమతుల్యతను పొందాలంటే మొక్కలు ఎక్కువగా నాటాలన్నారు. అనంతరం రామారావు పేట ప్రాంతంలో ఉచితంగా మొక్కల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నాగేశ్వరి, నాగమణి, వీఎస్ఆర్ మూర్తి, నాగిని పాల్గొన్నారు.

రోటరీ సన్‌రైజ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న వారిని అభినందిస్తున్న రోటరీ మాజీ గవర్నర్ డాక్టర్ పూషా

బోట్‌క్లబ్: స్థానిక పళ్లంరాజు నగర్‌లోని షిప్పింగ్ హౌస్‌లో శనివారం రోటరీ క్లబ్ ఆఫ్ కాకినాడ సన్ రైజ్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని రోటరీ మాజీ గవర్నర్ డాక్టర్ పూష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరంలో అన్ని అవయవాలు మార్చే అవకాశం ఉంది కానీ రక్తానికి ఆ అవకాశం లేదన్నారు. అది మన శరీరంలోనే తయారవుతుందని దీనిని దృష్టిలో ఉంచుకుని మనం రక్తదానం చేస్తే మరొకరికి ప్రాణ దానం అవుతుందన్నారు. ఆరోగ్యంగా ఉన్న వారు ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చునన్నారు. దేశంలో రోజుకు ఐదు కోట్ల యూనిట్లు అవసరం అవుతుందని, కానీ రెండు కోట్ల యాభై లక్షల యూనిట్లు మాత్రమే అందుబాటులో ఉందన్నారు. స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న సన్ రైజ్ సభ్యులను ఆయన అభినందించారు. క్లబ్ అధ్యక్షులు కమల్ సందీప్ మాట్లాడుతూ తమ క్లబ్ స్థాపించి మూడేళ్లు అయ్యిందని, రక్తం ఆవశ్యకత గుర్తించి ఏటా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది 74 యూనిట్లు సేకరించామని తెలిపారు. క్లబ్ కార్యదర్శి సాయి సుందర్, సభ్యులు నగధర్, ఏవీ రంగారావు, వి.దుర్గా మహేష్, షేక్ నాగ్ బాషా పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్



నగరంలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



కరపలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులు అర్పిస్తున్న ఎంఆర్‌పీఎస్, ఎస్సీ నాయకులు

కాకినాడ: మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. మహాజన సోషలిస్టు పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు వల్లూరి సత్తిబాబు, కార్యనిర్వాహక అధ్యక్షుడు పలివెల నవీన్ ఆధ్వర్యంలో స్థానిక లేడీస్‌క్లబ్ సమీపంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ సేవలను గుర్తిస్తూ భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంఆర్‌పీఎస్ ఉద్యమాన్ని ప్రారంభించి 30 ఏళ్ల గడుస్తున్న సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గ్రామ, గ్రామాన దండోరా జెండాలు ఆవిష్కరించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు చాట్ల ఆశీర్వాదం, మిరియాల వీరబాబు, దూలపల్లి కృష్ణ, నులుకుర్తి ఫకీర్ తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

కరప: మండలంలోని వివిధ గ్రామాల్లో మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రాం వర్ధంతిని శనివారం నిర్వహించి నివాళులర్పించారు. కరప, నడకుదురు, పెనుగుదురు, వలసపాకల, జెడ్.భావారం, కూరాడ తదితర గ్రామాల్లోని జగ్జీవన్‌రాం విగ్రహాలకు పూలమాలలు వేసి పలువురు నాయకులు నివాళులర్పించారు. కరపలో టీడీపీ జిల్లా ఎస్సీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి చాట్ల ఇమ్మాన్యుయేలు ఆధ్వరంలో నిర్వహించిన కార్యక్రమంలో పీహెచ్‌సీ ఎదురుగా ఉన్న జగ్జీవన్‌రాం విగ్రహానికి ఎంపీపీ కె.బుల్లికృష్ణవేణి నివాళులర్పించారు. ఎస్సీ నాయకులు రాయి చిన్నా, దార్ల శ్రీను, తాతపూడి శ్రీనివాసరావు, ఉందుర్తి ప్రకాశరావు, మంచాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘాటీ సెంటర్‌లో..

కాకినాడ సిటీ: కాకినాడ జగన్నాథపురం ఘాటీ సెంటర్‌లో భారత మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ వర్ధతిని శనివారం దళిత, గిరిజన, బీసీ, ముస్లిం, క్రైస్తవ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. అణగారిన వర్గాల ప్రజల కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. వేదిక నాయకులు డోకుబుర్ర భద్రం, బండి నరేంద్ర, ఆవుపాటి ఉమాశంకర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా పేరయ్యరాజు

తాళ్లరేవు: స్థానిక లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా పొన్నాడ పేరయ్యరాజు ఎంపికయ్యారు. ఆదివారం స్థానిక సూర్య భాస్కర కల్యాణ మండపంలో క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించనున్నారు. అధ్యక్షుడు పేరయ్యరాజు, కార్యదర్శి పెనుమల్లు నరేంద్ర వరప్రసాదరెడ్డి, కోశాధికారి కట్టా ఆదినారాయణ తదితరులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కార్యక్రమానికి మల్టిపుల్ జీఎల్‌టీ కో–ఆర్డినేటర్ డీవీఎస్ రాజు నూతన సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించనున్నారు.